
ఉచిత బస్సుకు
'ఆధార్' కష్టాలు



2



2

ఎస్సారెస్పీపై
గుర్రపు స్వారీ



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## 28 నుంచి ఎంఎడ్ పరీక్షలు ప్రారంభం

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో ఈనెల 28 నుంచి ఎంఎడ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి కె.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంఎడ్ ఒకటవ, రెండవ, మూడవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు, ఎంఎడ్ నాల్గో సెమిస్టర్ రెగ్యులర్/ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు 28 నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. అలాగే తెయూ పరిధిలో పీజీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ గంట చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆరురోజులుగా పీజీ పరీక్షలు జరుగుతున్నాయి.





## శ్రీరాంసాగర్ 16 వరద గేట్ల ఎత్తివేత..

**అక్షరటుడే, ఆర్మూర్ :** శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. మహారాష్ట్ర, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి 75వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1090.8 అడుగులకు (79.658 టీఎంసీలు) చేరింది. గురువారం అర్ధరాత్రి 12గంటలకు 16 వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. వరద గేట్ల ద్వారా ఎత్తి 49వేల 280 క్యూసెక్యులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1500 క్యూసెక్యులు, కాకతీయ కాలువ ద్వారా 6వేల 500 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 20వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్యులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్యులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతుండగా, 651 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. మొత్తం 78వేల 812 క్యూసెక్కుల నీటిని కాలువ ద్వారా వదులుతున్నారు.

### శ్రీరాంసాగర్‌ను సందర్శించిన మానేరు అధికారులు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టును మిడ్‌మానేరు జలాశయం ఎస్ఈ సుమతి, ఈఈ జగన్‌లు శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. ఈనెల 18వ తేదీ నుంచి నీటి విడుదల వివరాలను శ్రీరాంసాగర్ అధికారులు వివరించారు. వారివెంట వరద కాలువ డీఈఈ గణేష్, ఏఈఈలు, రాము, కొండ వంశీ సిబ్బంది ఉన్నారు.



## కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



**అక్షరటుడే, ఇందూరు:** కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెరిగేలా అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈవో రవికుమార్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఫేషియల్ బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా బోధించాలని.. అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతామని పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థి డేటాను ఎప్పటికప్పుడు కంప్యూటర్లలో నిక్షిప్తం చేయడంతో పాటు అపార్, పెన్ నెంబర్లను నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ ఖాలిక్ సిబ్బంది పాల్గొన్నారు.



యువత రోజురోజుకి డ్రగ్స్ వినియోగానికి బానిస అవుతున్నారు. ముఖ్యంగా పట్టణాలు, పల్లెలు తేడాలేకుండా గంజాయి వినియోగం పెరిగింది. కళాశాల స్థాయిలోనే కొందరు గంజాయికి బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఇంతలా ప్రభావం చూపిస్తున్న గంజాయి ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు కట్టడి వేసేలా నిజామాబాద్ సీపీ సాయిచైతన్య చర్యలు చేపట్టారు.

– అక్షరటుడే, నిజామాబాద్

# డ్రగ్స్ కట్టడికి యాక్షన్‌ప్లాన్

- జిల్లాలో గంజాయి, అల్ప్రాజోలం నియంత్రణకు సీపీ సాయిచైతన్య ప్రత్యేక చర్యలు
- అన్ని శాఖలతో సమన్వయం

సీపీ సాయిచైతన్య గతంలో హైదరాబాద్ నార్కోటిక్ బ్యూరోలో పనిచేశారు. దీంతో డ్రగ్స్ అక్రమ రవాణా కేసులు, కట్టడి చర్యలపై లోతైన అవగాహన ఉంది. ముఖ్యంగా కేసుల నమోదు, నిందితులను కట్టడి చేసేలా తీసుకోవాల్సిన వ్యూహాలు తెలుసు. దీంతో ఆయన నిజామాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన మొదటి నుంచి గంజాయి, అల్ప్రాజోలం తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణా చేస్తున్న వారిపై నిఘా పెట్టించారు. డ్రగ్స్ అక్రమ రవాణాను కట్టడి చేసేలా అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్నారు.

### సమన్వయంతో అడ్డుకట్ట..

జిల్లాలో గంజాయి, అల్ప్రాజోలం వినియోగం ఎక్కువగా జరుగుతోంది. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి అల్ప్రాజోలం, ఇతర ప్రాంతాల నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతోంది. పాత నేరస్థులే పదేపదే అక్రమ రవాణాకు పాల్పడి పోలీసులకు చిక్కుతున్నారు. ఇలాంటి వారి విషయంలో కఠిన చర్యలు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పనిచేసేలా సీపీ సాయిచైతన్య యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అందరూ పక్కాగా పనిచేస్తే జిల్లాలో డ్రగ్స్ అక్రమ రవాణాకు కొంతమేరైనా అడ్డుకట్ట పడనుంది.

### ఆకట్టుకునే ప్రజంటేషన్..

తాజాగా నిజామాబాద్ కలెక్టరేట్‌లో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా కట్టడి చర్యలపై సమీక్ష జరిపారు. జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో పాటు సీపీ సాయిచైతన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా.. ఈ సందర్భంగా అందరినీ ఆకట్టుకునేలా సీపీ తన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. డ్రగ్స్ అక్రమ రవాణా చేసే అక్రమార్కులపై పోలీసు, ఎక్సైజ్ శాఖల సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. నిందితుల ఆస్తులను జప్తు చేయడం తదితర అంశాలపై కులంకుశంగా వివరించిన తీరు ఆయన అనుభవానికి అద్దం పట్టింది.

## మౌలిక వసతులు మెరుగుపర్చడమే లక్ష్యం




**అక్షరటుడే, నిజాంసాగర్:** గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'పనుల జాతర' కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు తెలిపారు. జుక్కల్ మండలంలోని ఖండేబల్లూరులో శుక్రవారం పనులజాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, పల్లెల్లో మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా పనుల జాతర నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్, పొలాలకు మట్టి రోడ్లు, చెక్ డ్యాంలు, ఊట కుంటల నిర్మాణం, గ్రామీణ రోడ్లు, పశువుల పాకలు, కంపోస్ట్ గుంతలు, నర్సరీల పెంపకం, అంగన్‌వాడీ, జీపీ భవనాల నిర్మాణాలు తదితర పనులు చేపడతామన్నారు.



## ప్రారంభమైన రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని ఘన్ పూర్ – డిచ్‌పల్లి మధ్య రైల్వే గేట్ వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతులు ప్రారంభమయ్యాయి. ట్రాక్ వద్ద మరమ్మతుల నేపథ్యంలో అధికారులు గేట్‌ను క్లోజ్ చేశారు. దీంతో ఘన్ పూర్, ఖిల్లా డిచ్‌పల్లి, ముల్లంగి, పోలీస్ క్యాంప్ ప్రాంతాలకు చెందిన వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో డిచ్‌పల్లి మండలకేంద్రానికి చేరుకుంటున్నారు. పనులను త్వరగా పూర్తి చేసి గేట్ పునః ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



## ఆర్టీసీ బస్టాండ్‌లో తప్పిన ప్రమాదం

బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్‌లోని క్యాంటీన్‌లో శుక్రవారం పెద్ద ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. క్యాంటీన్‌లో మధ్యాహ్నం పైకప్పు పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడ్డాయి. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ప్రయాణికులు, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పైకప్పు పెచ్చులు ఊడి పడడంతో క్యాంటీన్‌లోని సామాగ్రి దెబ్బతింది. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్టాండ్‌లోని పాత భవనాలకు తక్షణమే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- అక్షరటుడే, బాన్సువాడ

## ప్రభుత్వ పథకాలతో ప్రజల కళ్లలో ఆనందం : షబ్బీర్‌అలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** గ్రామాల్లో తిరుగుతుంటే ప్రజల కళ్లలో ఆనందం కనిపిస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలేనని పేర్కొన్నారు. మాచారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, ఆహార భద్రత కార్డులను షబ్బీర్ అలీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వమని, పేదల అభ్యున్నతికి కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింగరావు, పల్లె రమేష్ గౌడ్, గణేష్ నాయక్, బ్రహ్మానందరెడ్డి, భిక్కనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, సుతారి రమేష్, ఇంద్ర సేనా రెడ్డి, స్వామి, నరసింహారెడ్డి, రాజు నాయక్, కొమురయ్య, లక్ష్మీరాజ్యం, చంద్ర నాయక్, దేవి సింగ్, రాము పాల్గొన్నారు.



## దేవాలయాల భూములు కాపాడాలి

**అక్షరటుడే, ఇందూరు:** ఆలయాల భూములను కాపాడాలని దేవాలయ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సర్వ సమాజ కమిటీ అధ్యక్షుడు యెండల లక్ష్మీ నారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని పెద్ద రాంమందిర్ భూములను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే కంఠేశ్వర్, శంభుని గుడికి ఆనుకొని ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే శంభుని గుడికి ఆనుకొని ఉన్న చెప్పుల దుకాణం తొలగింపజేశామని వివరించారు. సర్వసమాజ్ కమిటీ, హిందూ సమాజం తమకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఊర పండుగ కమిటీ అధ్యక్షుడు రామర్తి గంగాధర్, పద్మశాలి సంఘం నగర అధ్యక్షుడు దత్తాత్రి, హమాలీ సంఘం అధ్యక్షుడు పరుశురాం, ముదిరాజ్ సం ఘం గౌరవాధ్యక్షుడు గోపాల్, ఆయా సంఘాల నాయకులు ప్రవీణ్, రాజు, సుభాష్, లక్ష్మణ్, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకే శిక్షణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వీఐపీల భద్రతా సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు వారికి ఇచ్చే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని సీపీ సాయిచైతన్య అన్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పీఎస్‌వోలకు (పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్) శుక్రవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీఐపీల భద్రత నేపథ్యంలో సేవలు అందించే పీఎస్‌వోల పాత్ర కీలకమైందన్నారు. పీఎస్‌వోల నైపుణ్యాలను మెరుగుపర్చడం, అత్యాధునిక విధానాలపై అవగాహన కల్పించడానికి ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు, నైపుణ్యం, అనుభవం వారి బాధ్యతల్ని మరింత సమర్థంగా నిర్వర్తించేందుకు దోహదపడతాయన్నారు. ప్రతి పీఎస్‌వో నైపుణ్యంతో, పట్టుదలతో, నిబద్ధతతో ముందుకు వెళ్లాలని సూచించారు. రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రతి పీఎస్‌వో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఏఆర్ డీసీపీ రామచంద్ర రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, తిరుపతి, సతీష్, శేఖర్ బాబు పాల్గొన్నారు.




## నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు పోలీస్‌శాఖ వివిధ చర్యలు తీసుకుంటోంది. ఖలీల్‌వాడిలో ట్రాఫిక్ నియంత్రణకు పలు చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్‌అలీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తన సిబ్బందితో రంగంలోకి దిగారు. రద్దీ ప్రాంతమైన ఖలీల్‌వాడిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. ఖలీల్‌వాడిలో ఇతర సిబ్బంది వన్‌వేను ఏర్పాటు చేశారు. పలు కూడళ్ల వద్ద కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. చెన్నయ్ షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు వన్‌వే చేశారు. అలాగే ముదిరాజ్ హనుమాన్ ఆలయం నుంచి రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు.. ఎస్ఎస్ఆర్ కళాశాల నుంచి కోర్టు చౌరస్తా వరకు వన్‌వే చేశారు. దీంతో వాహనదారులు ఈ ప్రాంతాలపై అవగాహనతో రాకపోకలు సాగించాలని ట్రాఫిక్ పోలీసులు పేర్కొంటున్నారు. వన్‌వే చేసిన అనంతరం ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఖలీల్ వాడి, రాష్ట్రపతి రోడ్, ముదిరాజ్ వీధిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సబ్ కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాను టీఎన్జీవోస్ ఆర్మూర్ యూనిట్ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం యూనిట్ ఉద్యోగుల సమస్యలపై చర్చించగా.. సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్మూర్ యూనిట్ అధ్యక్షుడు శశికాంత్ రెడ్డి, కార్యదర్శి విశాల్, కార్యవర్గ సభ్యులు సాయికుమార్, విక్రమ్, వికాస్, దిలీప్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో 'పనుల జాతర' కార్యక్రమాలు ప్రారంభం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు రెండో విడత 'పనుల జాతర' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీవో ప్రకాష్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలంలో శుక్రవారం వివిధ పంచాయతీల్లో ఉపాధిహామీ పనుల జాతరలో భాగంగా భిక్కనూరు, మీసాన్ పల్లి, అడవిలింగాల పంచాయతీల్లో గేదెల షెడ్‌లకు భూమిపూజ నిర్వహించారు. గతేడాది చేపట్టిన పనుల జాతరలో ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు కల్పించామని, అభివృద్ధి పనులలో కూలీల వేతనాలకు అందజేశామని ఆయన వివరించారు. ఈ దఫా పనుల జాతరలో ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా మహిళలకు ఉపాధి కల్పన, జలనిధి కింద నీటి సంరక్షణ పనులతో పాటు, వ్యవసాయ పొలాలకు బాట ల నిర్మాణం, ఫల వనాల పెంపకం చేపడతామన్నారు. పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసే ఆ చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ప్రత్యేక అధికారి సురేందర్, ఏపీవో వినోద్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



## సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతి


**అక్షరటుడే, బాన్సువాడ:** మోస్రా మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్ రాజశేఖర్‌ను బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆయనకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మోస్రా వెంకటేశ్వర ఆలయం నుంచి కుర్నాపల్లి రోడ్డు వరకు, చింతకుంట రోడ్డు నుంచి గోవూర్ కాంట వరకు రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు సురే గణేష్, సుంచు హన్మగౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ గుత్పే జగన్మోహన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బొజ్జ సుదర్శన్ గౌడ్, భూపాల్ రెడ్డి, రాజా రెడ్డి, మాజీ వార్డు సభ్యులు లింగం, పీఏసీఎస్ డైరెక్టర్లు లక్ష్మా రెడ్డి, గంగారెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

## శ్రీచైతన్య పాఠశాలకు నోటీసులు జారీ

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలకు ఎంఈవో రాజగంగారాం నోటీసులు జారీ చేశారు. విద్యార్థులకు టీసీలు ఇవ్వడానికి పాఠశాల డబ్బులు వసూలు చేస్తున్నట్లు విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఎంఈవో రాజగంగారాం స్కూల్‌లో విచారణ చేపట్టారు. అనంతరం శుక్రవారం పాఠశాలకు నోటీసులు జారీ చేశారు.

**ఉచిత బస్సు ప్రయాణానికి పలువురు మహిళలు దూరం అవుతున్నారు. ఆధార్ కార్డు ఉన్నా.. కండక్టర్లు జీరో టికెట్ ఇవ్వడం లేదు. ఆధార్ అప్‌డేట్ చేసుకోకపోవడంతో డబ్బులు చెల్లించాలని తేల్చి చెబుతున్నారు. అడ్రస్‌లో తెలంగాణకు బదులు ఆంధ్రప్రదేశ్ ఉన్న వారు టికెట్ తీసుకోవాల్సిందే అంటున్నారు. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.**

- అక్షరటుడే, కామారెడ్డి





# ఉచిత బస్సుకు 'ఆధార్' కష్టాలు

▸ కార్డులో ఆంధ్రప్రదేశ్ ఉంటే వర్తించని పథకం ▸ టికెట్ తీసుకోవాల్సిందే అంటున్న కండక్టర్లు ▸ ఇబ్బందులు పడుతున్న మహిళలు

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. ఆధార్, ఓటర్ కార్డులు చూపిస్తే తెలంగాణకు చెందిన మహిళలు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. అయితే చాలా మంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆధార్ కార్డులను తీసుకున్నారు. తర్వాత వాటిని అప్‌డేట్ చేసుకోలేదు. అడ్రస్‌లో రాష్ట్రం దగ్గర ఆంధ్రప్రదేశ్ అని ఉంది. దీంతో పలువురు కండక్టర్లు ఆంధ్రప్రదేశ్ ఉంటే ఈ పథకం వర్తించదని టికెట్ కొడుతున్నారు. దీంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సులో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ఆశతో దగ్గర డబ్బులు లేకున్నా బస్సు ఎక్కుతున్న మహిళలకు ఈ తరహా ఘటనలు ఎదురుకావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అభ్యంతరం చెబుతున్న కండక్టర్లు

ఉచిత బస్సు పథకం అమలు తర్వాత జిల్లాలో నిత్యం వేలాది మంది ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారు. అయితే తెలంగాణ ప్రాంతానికి చెందిన వారైనా ఆధార్‌లో రాష్ట్రం పేరు ఆంధ్రప్రదేశ్ ఉండటంతో కండక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఆధార్ కార్డును నిశితంగా పరిశీలిస్తున్నారు. తెలంగాణ పేరు లేకపోతే టికెట్ డబ్బులు ఇవ్వాల్సిందేనని చెప్పడంతో తప్పని సరి పరిస్థితుల్లో మహిళలు డబ్బులు చెల్లిస్తున్నారు. కొంతమంది మహిళలు సరిపడా డబ్బులు లేక మధ్యలోనే దిగిపోతున్నట్టుగా తెలుస్తోంది.

### జిల్లా పేరు ఉన్నా..

తెలంగాణ ఏర్పడక ముందే ఆధార్ వ్యవస్థ వచ్చింది. దీంతో చాలా మంది ఆధార్‌కార్డుల్లో రాష్ట్రం పేరు తెలంగాణ అని ఉంది. రాష్ట్ర విభజన తర్వాత తీసుకున్న కార్డుల్లో మాత్రమే తెలంగాణ ఉంది. అయితే కార్డు అప్‌డేట్ చేసుకున్న వారిలో సైతం రాష్ట్రం పేరు మారింది. అయితే చాలా మంది కార్డులను అప్‌డేట్ చేసుకోలేదు. కొంత మంది చేసుకున్నా.. గతంలో వచ్చిన ఒరిజినల్ ప్రింట్‌లు తీసుకొని బస్సులు ఎక్కుతున్నారు. ఇలాంటి వారికి కండక్టర్లు ఫ్రీ టికెట్ ఇవ్వడం లేదు. అయితే జిల్లా పేరు ఉన్నా.. ఆంధ్రప్రదేశ్ ఉంటే టికెట్ ఇవ్వకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ కార్డులో తాము ఏ జిల్లాకు చెందిన వారిమో ఉందని, అయినా ఆంధ్రప్రదేశ్ ఉందనే కారణంతో టికెట్ ఇవ్వకపోవడం సరికాదంటున్నారు.

### తెలంగాణ ప్రాంతం వారు అర్హులే



ఆధార్ కార్డులో రాష్ట్రం పేరు ఆంధ్రప్రదేశ్ ఉంటే టికెట్ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు అవాస్తవం. తెలంగాణ పేరు లేకున్నా ఈ రాష్ట్రానికి సంబంధించిన జిల్లా ఉంటే జీరో టికెట్ ఇస్తున్నాం. కండక్టర్లకు కూడా ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేశాం. అలా ఎవరైనా టికెట్ డబ్బులు వసూలు చేస్తే మా దృష్టికి తీసుకురావాలి.

– కరుణశ్రీ, డిపో మేనేజర్ కామారెడ్డి

## జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండలంలోని సాంబపూర్ గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ శ్యామల, వైస్‌ఛైర్మన్ రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని శంకర్, నాయకులు శశికాంత్, కాంత్ రెడ్డి, బాన్సువాడ మున్సిపల్ మాజీ ఛైర్మన్ జంగం గంగాధర్, మోహన్, హన్మాండ్లు, రాంజీ, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ షాప్ నిర్వాహకుల అరెస్ట్..



**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి పట్టణంలో మొబైల్ షాప్‌ల నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. 'గో బ్యాక్ మార్వాడీ' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శుక్రవారం మొబైల్స్ షాప్స్ బంద్ నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారంతా.. బస్టాండ్ వద్ద ధర్నా చేయడానికి సన్నద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దఎత్తున చేరుకుని ధర్నా కార్యక్రమానికి నిలిపేశారు. 8 మంది మొబైల్ షాప్ నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసులు, మొబైల్ షాప్ నిర్వాహకులకు మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు మాట్లాడుతూ.. జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని, ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు చేయడానికి అనుమతి లేదని పోలీసులు పేర్కొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మలిదశ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పోస్ట్ కార్డు ద్వారా విన్నవిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాధర్ గుప్తా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి విస్మరించారని అన్నారు. కార్యక్రమంలో ఫోరం మండల ప్రధాన కార్యదర్శి గంజివార్ చందు, దండు విజయ్, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

## వర్ని తహశీల్దార్‌కు సన్మానం



**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండల తహశీల్దార్ సాయిలును కూనీపూర్ గ్రామస్థులు పలువురు శుక్రవారం సన్మానించారు. ఆయన చేసిన ఉత్తమ సేవలకుగాను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. దీంతో కూనీపూర్‌లో తహశీల్దార్ సాయిలును సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ రాజారెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు గిరి గంగారాం, మాజీ సర్పంచ్ కాంతయ్య, వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.



## శివ సహస్రనామ పారాయణానికి మహిళలు

**అక్షరటుడే, బాన్సువాడ:** హైదరాబాద్‌లో మణిద్వీప వర్ణన పూజ, శివ సహస్రనామ పారాయణానికి బాన్సువాడ నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. శైవక్షేత్ర వనిత శక్తి ఇంటర్నేషనల్, ధర్మో రక్షతి రక్షిత ట్రస్ట్, వాసవి ఇంటర్నేషనల్ పరివార్ మహిళ రాష్ట్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. శైవక్షేత్ర పీఠాధిపతి శివ స్వామిజీ నేతృత్వంలో పారాయణం జరుగనుందని.. ఈ సందర్భంగా పట్టణంలో మహిళలతో పాటు.. తాడ్కోల్ గ్రామాల నుంచి మహిళలు వెళ్లినట్లు మహిళా ప్రతినిధి గంగా జ్యోతి వివరించారు. ఆమె వెంట విజయలక్ష్మి, ధనలక్ష్మి, పద్మ, భాగ్య, కవిత, కాశీనాథ్, ఎల్లన్న తదితరులు ఉన్నారు.

## ఎస్సారెస్పీపై గుర్రపు స్వారీ



**శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో ప్రాజెక్టుపై సందడి నెలకొంది. ఇదే క్రమంలో ప్రాజెక్టుపై రాజస్థాన్‌కు చెందిన కొందరు వ్యక్తులు గుర్రపుస్వారీని ఏర్పాటు చేశారు. గుర్రాలపై రౌండ్‌కు రూ.50 తీసుకుంటూ చిన్నారులను కొద్దిసేపు తిప్పుతున్నారు. చిన్నారులు గుర్రపుస్వారీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు.**

– అక్షరటుడే, ఆర్మూర్

## బీజేపీ జిల్లా కమిటీ ఎంపికలో ఎంపీ అర్వింద్ మార్క్

**అక్షరటుడే, ఇందూరు :** బీజేపీ జిల్లా నూతన కమిటీని నియమించిన విషయం తెలిసిందే. కాగా.. ఈ ఎంపిక విషయంలో నాయకత్వం ఆచితూచి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు కట్టబెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆ దిశగా పనిచేసే నాయకులకు పదవులు ఇచ్చారు. ఈ విషయంలో ఎంపీ అర్వింద్ గత కొద్ది రోజులు కసరత్తు జరిపి నూతన కమిటీని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి యువతకు పెద్దపీట వేశారు. ఇది వరకు మాజీ ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారు, వివిధ హోదాల్లో కొనసాగిన అనుభవం కలిగిన వారికి నూతన కమిటీలో స్థానం కల్పించారు. ఎంపికలో ఎంపీ అర్వింద్ మార్క్ స్పష్టంగా కనబడినట్లు చర్చ జరుగుతోంది. జిల్లాలో పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన సూచన మేరకు జిల్లా కమిటీని ఆచితూచి ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

### బీజేపీ జిల్లా నూతన కమిటీ ఇదే..

భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అనుమతితో ఎంపీ ధర్మపురి అర్వింద్, సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ సూచనతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులుగా నక్క రాజేశ్వర్, రాంచందర్, బంటు రాము, పోతుగంటి సురేందర్ ప్రమోద్‌కుమార్, పాలెపు రాజు నియమితులయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా పోతంకర్ లక్ష్మీనారాయణ, నిమ్మల శ్రీనివాస్‌రెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులుగా సంగం అనిల్ నోముల నర్సారెడ్డి, పొల్కం వేణు, దంపల్లి జ్యోతి, రాధ, సవిత నియామకమయ్యారు. కోశాధికారిగా చింతకింది శ్రీనివాస్‌రెడ్డి, ఆఫీస్ సెక్రెటరీగా బద్దం కిషన్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా కూరెళ్ల శ్రీధర్, మీడియా కన్వీనర్‌గా పుట్ట వీరేందర్, ఐటీ ఇన్‌ఛార్జీగా పిల్లి శ్రీకాంత్ నియమితులయ్యారు.

## అపరిశుభ్రంగా తాగునీటి సరఫరా



**నిజాంసాగర్ మండలంలోని ఆరేపల్లిలోని పాత పంచాయతీ భవనం పక్కన తాగునీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంక్‌కు పూర్తిగా నాచు పేరుకు పోయింది. ఈ ట్యాంక్ నుంచి కాలనీవాసులందరూ తాగునీటిని తీసుకెళ్తుంటారు. కానీ పూర్తిగా నాచుపట్టిన ఈ ట్యాంక్‌ను జీపీ సిబ్బంది పట్టించుకోవట్లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నిత్యం కంటికి కనిపించే ట్యాంక్‌ను సిబ్బంది నిర్లక్ష్యం చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు పబలే పరిస్థితులు ఉన్న దృష్ట్యా వెంటనే ట్యాంక్‌ను శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు.**

– అక్షరటుడే, నిజాంసాగర్